www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 18 అక్టోబర్ 2025
5
వైఎస్ఆర్

బ్యాంకు ఖాతాలను నిర్వహణలోకి తీసుకురావాలి
ప్రజాశక్తి - కడప

భారత ప్రభుత్వం అసంచాలనీయ బ్యాంక్ డిపాజిట్లు, వాటాలు, బీమా, పొదుపు పథకాల నిధులు నిజమైన హక్కుదారులకు తిరిగి చేరేలా బ్యాంకర్లు చురుకైన పాత్ర పోషించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్‌లో 7-10 సంవత్సరాల పాటు నిరుపయోగంగా ఉన్న అసంచాల అకౌంట్లను తిరిగి నిర్వహణలోకి తీసుకు రావాలనే ఉద్దేశంతో భారత ఆర్థిక మంత్రిత్వ శాఖ చేపట్టిన అవగాహన కార్యక్రమానికి సంబంధించి జిల్లా కలెక్టర్ బ్రోచర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మూడు నెలలపాటు ప్రత్యేక ప్రచారం ప్రారంభించి సంబంధిత అకౌంట్లను యాక్టివేట్ చేసేలా బ్యాంకర్లు చురుకైన పాత్ర పోషించాలన్నారు. బ్యాంకు కంట్రోలర్లు, సమన్వయకర్తలు తమ శాఖలను చైతన్యపరచి, డెఫ్ ఖాతాదారులకు లేఖలు, ఎస్ఎంఎస్‌లు పంపించాలని సూచించారు.

ఆ ఇద్దరిలో ఎవరిది!

- టిడిపి అధ్యక్ష పీఠంపై ఐవిఆర్ఎస్ సర్వే!
- సి.భూపేష్ వర్సెస్ శ్రీనివాసులరెడ్డి
- సర్వేలో పాల్గొనడంపై కేడర్‌లో అనాసక్తి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

టిడిపి జిల్లా అధ్యక్ష పదవిపై ఐవిఆర్ఎస్ సర్వే ఉత్కంఠను కలిగిస్తోంది. మూడు నెలల కిందట టిడిపి అధిష్టానం జిల్లా అధ్యక్ష పదవికి జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి, ప్రస్తుత జిల్లా అధ్యక్షులు ఆర్.శ్రీనివాసరెడ్డి సహా మరో ఇద్దరిపై ఐవిఆర్ఎస్ సర్వే నిర్వహించిన సంగతి తెలిసిందే. అనంతరం రాయలసీమ జోన్ ఇన్‌ఛార్జి బీద రవిచంద్ర, కమిటీ సభ్యులు బ్రహ్మంచౌదరి, జయనాగేశ్వరరెడ్డి జిల్లాలో పర్యటించినప్పటికీ జిల్లా అధ్యక్షుని ఎంపిక చేయలేక పోయింది. తాజాగా శుక్రవారం సాయంత్రం ఐదు గంటల నుంచి మరోసారి సి.భూపేష్‌రెడ్డి, ప్రస్తుత జిల్లా అధ్యక్షులు ఆర్.శ్రీనివాసరెడ్డిపై ఐవిఆర్ఎస్ సర్వే నిర్వహిస్తోంది. కమిటీ సభ్యులు ద్వితీయశ్రేణి నాయకులు, సీనియర్లు, కార్యకర్తలకు ఫోన్ చేసి ఇద్దరిలో ఎవరి సరైన నాయకుడు అవుతారని ఆరా తీస్తోంది. జిల్లా అధ్యక్ష పదవి ఎంపిక సర్వేలో పార్లమెంటరీ కమిటీలు, పార్టీ అధికారంలోకి రావడానికి చర్యలు తీసుకోవడంపై వేసిన పలు కమిటీల్లో పనిచేసిన ద్వితీయశ్రేణి నాయకులు, కార్యకర్తలు ఐవిఆర్ఎస్ సర్వేల్లో పాల్గొనడానికి మొగ్గుచూపని పరిస్థితి కనిపిస్తోంది. టిడిపిని అధికారంలోకి తీసుకురావడానికి అహర్నిశలు శ్రమించిన సీనియర్ నాయకులకు, కార్యకర్తలకు నామినేటెడ్ పదవుల్లో స్థానం లభించక పోవడమే కారణమని తెలుస్తోంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు, అధికారంలో ఉన్నప్పుడు శ్రమించిన తమను ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులు నిర్లక్ష్యం చేయడం, అధిష్టానానికి వాస్తవాలు తెలిసినప్పటికీ ఎటువంటి న్యాయం చేయని నేపథ్యంలో తీవ్ర విముఖత ఏర్పడినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయిలో సీనియర్లను గుర్తించి ఆర్థికంగా, రాజకీయంగా ముందుకు తీసుకురావడంలో రాజకీయాలకు పాల్పడడంపై కేడర్‌లో తీవ్ర అసంతృప్తి నెలకొని ఉన్నట్లు తెలుస్తోంది. ఐవిఆర్ఎస్ సర్వే ఫలితాలను అధిష్టానం బయటపెట్టని నేపథ్యంలో సర్వేలో తమ అభిప్రాయాలు తెలిపినప్పటికీ ఎలాంటి ప్రయోజనం ఉండదనే అభిప్రాయానికి కేడర్ వచ్చిందనే వాదన వినిపిస్తోంది. క్షేత్రస్థాయిలో ఇటువంటి పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో 2024 సార్వత్రిక ఎన్నికల్లో సీనియర్ కేడర్‌లో నెలకొన్న తరహా ఉత్సాహం 2029 సార్వత్రిక ఎన్నికల నాటికి ఉంటుందా అనే వాదన కేడర్ నుంచి బలంగా వినిపిస్తుండడం గమనార్హం.

మ్యాప్‌ను పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో సిఎండి శివశంకర్ లోతేటి

సోలార్ పనులను పరిశీలించిన ట్రాన్స్‌కో సిఎండి
ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

దువ్వూరులో పిఎం-కుసుమ్ ఫీడర్ సోలార్ విద్యుతీకరణ పనులను, మైదుకూరు మండలంలోని రాయప్పగారిపల్లి గ్రామంలో ఆర్‌డిఎస్-ఎస్ పనులను ట్రాన్స్‌కో సిఎండి శివశంకర్ లోతేటి శుక్రవారం పరిశీలించారు. దువ్వూరు మండలంలో 5 మెగా వాట్స్ సామర్థ్యంతో చేపడుతున్న ఫీడర్ సోలార్ విద్యుతీకరణ పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. అలాగే, సోలార్ విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన స్థల సేకరణ, మట్టి పరీక్షలకు సంబంధించిన అంశాలను సమీక్షించారు. అనంతరం మైదుకూరు మండలంలోని రాయప్పగారిపల్లి గ్రామంలో ఆర్‌డిఎస్ఎస్ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈపథకం ద్వారా రైతులకు నాణ్యమైన, నిరంతర ఉచిత విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యమన్నారు. గ్రామీణ ప్రాంతాలకు 24 గంటల త్రీ ఫేస్ విద్యుత్ సరఫరా అందిస్తామన్నారు. రాయప్పగారిపల్లి గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం జరిగిన పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి అధికారులతో సమీక్షించారు. పనులు నిర్వహించేటప్పుడు అన్ని భద్రతా జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాల్సిన అవసరాన్ని ఆయన తెలియచేశారు. లక్ష్యాలను సమర్థవంతంగా సాధించేందుకు బృంద సమన్వయం అత్యంత కీలకమని, ప్రతి ఒక్కరూ కలసి పనిచేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎస్ఇ రమణ, ఇఇలు లక్ష్మీపతి, నాగరాజు, డిఇఇలు శ్రీకాంత్, శివ భాస్కర్, ఎఇలు రాజ్ కుమార్,రామ భద్రయ్య, హరి , సిబ్బంది పాల్గొన్నారు. **దువ్వూరు :** సిఎండి దువ్వూరులో ప్రధానమంత్రి కుసుం పథకం ఫీడర్ సోలార్ విద్యుదీకరణ పనులను పరిశీలించారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన స్థల సేకరణ, మట్టి పరీక్ష సంబంధిత అంశాలను సమీక్షించారు. పథకం ద్వారా రైతులకు నాణ్యమైన, నిరంతర ఉచిత విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం సిబ్బందితో ప్రత్యక్షంగా మాట్లాడారు. పనులు నిర్వహించేటప్పుడు అన్ని భద్రతా జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాల్సిన అవసరాన్ని ఆయన తెలియజేశారు. లక్ష్యాలను సమర్థవంతంగా సాధించేందుకు బృంద సమన్వయం అత్యంత కీలకమని, ప్రతి ఒక్కరూ కలసి పనిచేయాలని ఆయన సూచించారు.

బాలికల సంరక్షణకు ప్రత్యేక చర్యలు
ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు) : బాలికల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.కె నాగరాజు తెలిపారు. మైదుకూరు కెజిబివి, వనిపెంట గురుకుల పాఠశాలలో ఆరోగ్య అవగాహన కార్యక్రమం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ బాలికా శిశు సంరక్షణ కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఆడపిల్లల ప్రాముఖ్యత, వారిని రక్షించడం, చదివించడం ఆవశ్యకత గురించి వివరించారు. ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా పరిశుభ్రత ప్రాముఖ్యతను, సరైన పద్ధతిలో చేతులు కడుక్కోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను తెలియజేశారు. అత్యవసర సమయాల్లో ప్రాథమిక చికిత్సగా ఉపయోగపడే సిపిఆర్ (కార్డియోపల్మనరీ రిసిసిటేషన్) గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉప జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి మల్లేష్, రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం ప్రోగ్రామ్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్, డెమో డి. భారతి, మెడికల్ ఆఫీసర్ సుమధుర, పాఠశాల ప్రిన్సిపాళ్లు, ఆరోగ్య సిబ్బంది, కెజిబివి హాస్టల, గురుకుల పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు భాష అమలుకు చర్యలు తీసుకోవాలి
ప్రజాశక్తి - కడప అర్బన్ : యోగివేమన విశ్వవిద్యాలయంలో తెలుగు భాష సంపూర్ణంగా అమలుకు చర్యలు తీసుకోవాలని, తెలుగు తల్లి విగ్రం ఏర్పాటు చేయాలని మొల్ల సాహితీ పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు గానుగపెంట హనుమంతరావు విశ్వవిద్యాలయ విసి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్‌ను కలసి కోరారు. తెలుగు భాషకు పుట్టినిల్లయిన కడప జిల్లాలో తొలి తెలుగుశాసనం లభించిందని, అయ్యలరాజు రామభద్రుడు. అష్టదిగ్గజ కవులు, వేమన, అల్లసాని పెద్దన, రామరాజభూషనుడు, అయ్యల రాజు రామభద్రుడు, కవయిత్రి మొల్ల ఈ జిల్లాలో జన్మించినవారేనని వివరించారు. విశ్వవిద్యాలయంలో సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. వైవీయూలో మొల్ల జయంతి కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఆ కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగించాలని కోరారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి
ప్రజాశక్తి - కడప : కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 23 నుంచి మహిళలకు ఉచితంగా టైలరింగ్, బ్యూటీ పార్లర్, ఎంబ్రాయిడరీలలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నామని, శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ డైరెక్టర్ ఎం. ఆరిఫ్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలోని 18 నుంచి 45 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన నిరుద్యోగ మహిళలు పై శిక్షణ కార్యక్రమాలకు అర్హులు అని తెలిపారు. గ్రామీణ ప్రాంత మహిళలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారని పేర్కొన్నారు. వివరాలకు 9440905478, 9985606866, 9440933028లలో సంప్రదించాలన్నారు

రేపు బిసి భవన్‌లో సదస్సు
ప్రజాశక్తి - కడప అర్బన్

సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయిపై జరిగిన దాడిని ఖండిస్తూ ఈనెల 19న ఉదయం 10 గంటలకు బిసి భవన్‌లో కడప జిల్లా పౌర సమాజం ఆధ్వర్యంలో నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని ప్రముఖ లాయర్ ఎ.సంపత్ కుమార్, సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్, డాక్టర్ మల్లెల భాస్కర్, నాయకులు సుబ్రహ్మణ్యం, సిపిఐ, సిపిఎం నగర కార్యదర్శులు ఎన్.వెంకట శివ, రామ్మోహన్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాస్వామ్యాన్ని అత్యంత దయనీయంగా మారుస్తూ దేశంలో అత్యున్నతమైన న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి పైన దాడి చేయడం వెనుక మతోన్మాదుల ఆలోచనలున్నాయని పేర్కొన్నారు. పక్క ప్రణాళికతో మత ఉన్మాదంతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పై దాడి చేశారని పేర్కొన్నారు. సదస్సుకు హైకోర్టు మాజీ న్యాయమూర్తి చంద్రకుమార్, జన విజ్ఞాన వేదిక ఫౌండర్ డాక్టర్ బ్రహ్మారెడ్డి ముఖ్య వక్తలుగా పాల్గొని ఉపన్యాసాలు ఇస్తారని పేర్కొన్నారు. జిల్లాలోని విద్యావంతులు, ఉపాధ్యాయ సంఘం నాయకులు మేధావులు, ప్రజాస్వామిక వాదులు, ప్రజాతంత్ర శక్తులు అభ్యుదయ కాముకులు సదస్సులో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

అట్టహాసంగా మండల స్థాయి క్రీడా పోటీలు
ప్రజాశక్తి - ముద్దనూరు

జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉప్పలూరు ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయులు రఘురామ్ ఆధ్వర్యంలో వ్యాయామ ఉపాధ్యాయులు ఇశ్రాయేలు మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. సర్పంచ్ పల్లా గంగయ్య పోటీలు ప్రారంభించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలకు చెందిన విద్యార్థులు క్రీడల్లో పాల్గొని సత్తా చాటి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్ -14,17 విభాగంలో బాల, బాలికలకు అథ్లెటిక్స్,గేమ్స్ పోటీలు నిర్వహించారు. అథ్లెటిక్స్ విభాగంలో రన్నింగ్, షాట్ పుట్, జావెలిన్, లాంగ్ జంప్, హై జంప్, డిస్కస్ త్రో నిర్వహించారు. గేమ్స్ విభాగంలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, యోగ, చెస్ పోటీలు నిర్వహించారు. నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో నాయకులు పల్లా గోపాలకృష్ణ, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ప్రమాదకర గుంతలకు మరమ్మతులు చేయాలి
ప్రజాశక్తి- కడప అర్బన్ : కడప అలంఖాన్‌పల్లె బైపాస్ నుంచి రిమ్స్ పోయే దారిలో ప్రమాదకరంగా రోడ్డుకు గుంతలు పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని, అధికారులు మరమ్మతులు చేయాలని డివైఎఫ్ఐ నగర కార్యదర్శి విజయ్ తెలిపారు. శుక్రవారం గుంతల రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం వందలాది వాహనాలు రోడ్డు మార్గాన వెళ్ళే ప్రజలకు ప్రమాదకరంగా గుంతలు పడి నరకం చూపిస్తున్నాయని అన్నారు. రాత్రి సమయంలో చాలా మంది గుంటలు కనపడక ప్రమాదాలకు కూడా గురయ్యారని చెప్పారు. టిడిపి మహానాడు సందర్భంగా తూతూ మంత్రంగా మరమ్మతులు చేశారని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతలును పూడ్చాలని, రోడ్డు మరమ్మతులు చేయాలని అన్నారు. లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఉదయ్ పాల్గొన్నారు.

కార్తీక వన భోజనం జయప్రదం చేద్దాం
ప్రజాశక్తి - కడప అర్బన్

కృష్ణదేవరాయల చిత్రపటానికి నివాళలర్పిస్తున్న నాయకులు

బలిజ కులస్తుల కార్తీక వనభోజనం జయప్రదం చేద్దామని జెఎసి ప్రముఖులు రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం ఆర్‌జెయుపి సమావేశపు హాలులో, కృష్ణా హాల్ వద్ద, శ్రీకృష్ణదేవరాయల చిత్ర పటానికి గజమాలవేసి నివాళులర్పించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా హరి ప్రసాద్, నారాయణస్వామి, సుంకర శ్రీనివాస్, అమరప్ప, టింబర్ డిపో శ్రీనివా సులు, రమేష్‌తో పాటు ప్రసాద్ మంజులాదేవి శ్రీనివాసులు ఉషాదేవి మారుతీ ప్రసాద్ హాజరయ్యారు. జెఎసి అధ్యక్షులు సగినాల శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి రామమోహన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొవ్వూరు మస్తాన్ రాయల్ వనభోజన కార్యక్రమాల నిర్వహణపై చర్చించారు. నవంబర్ రెండవ తేదీ కార్తీక వనభోజనం ఉంటుందని తెలిపారు. బలిజ కులస్తులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పోలుదాసు విజయ కుమార్, బలిజ సంఘం నాయకులు పాల్గొన్నారు.

హైస్కూల్ క్రీడా మైదానం బాగు చేయాలి : డివైఎఫ్ఐ
ప్రజాశక్తి- జమ్మలమడుగు : పట్టణంలోని ప్రొద్దుటూరు రోడ్డులో ఉన్న జిల్లా పరిషత్ మార్కెట్ హై స్కూల్ క్రీడా మైదానం చెరువును తలపిస్తుందని తక్షణమే సంబంధిత అధికారులు బాగు చేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు ఎల్లయ్య తెలిపారు. శుక్రవారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో సంబంధిత క్రీడామైదానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ జమ్మలమడుగు నుంచి ప్రొద్దుటూరు వెళ్లే దారిలో మున్సిపల్ కార్యాలయం పక్కన ఎంతో చరిత్ర కలిగిన జిల్లా పరిషత్ మార్కెట్ హైస్కూల్ ప్రస్తుతం అధ్వాన పరిస్థితిలో ఉందన్నారు. విద్యార్థులు ఆడుకోనికి వీలు లేని విధంగా పిచ్చి మొక్కలు ఒలిచాయని పేర్కొన్నారు. దాదాపు పాఠశాల రెండు ఎకరాల స్థలంలో క్రీడా మైదానం ఏర్పాటైందని, ఇప్పుడు చూస్తే పాఠశాల స్థలం ఎంతో ఉందో, లేదో అక్రమాలు గురి అయిందో తెలియని పరిస్థితి అన్నారు. సంవత్సరాల చరిత్ర కలిగిన పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో నిత్యం ఆకతాయిలకు అడ్డాగా మారిందన్నారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు, ఉద్యోగుల
సమస్యలు పరిష్కరించాలి
- ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మిక, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. విజయవాడలోని విద్యుత్ సౌధా దగ్గర చర్చలు విజయవంతం కావాలని వారికి మద్దతుగా ఎపి స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం నగరంలోని విద్యుత్ ఎస్ఇ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి బి.ఎస్. నాగ సుబ్బయ్య అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా యూనైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, స్ట్రగుల్ కమిటీ చైర్మన్ పి.సుదర్శన్ రెడ్డి హాజరై మాట్లాడారు. ఎపి పవర్ జెఏసి సమ్మెకు దిగితే అండగా మేము ఉంటామని పేర్కొన్నారు. విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలనేది చిరకాల కోరిక, న్యాయమైన డిమాండ్ అన్నారు. దానికి ఉన్న అడ్డంకులు ఏమిటి, నేరుగా వేతనాలు చెల్లించడం వల్ల సంస్థకు రూ.192 కోట్లు మిగులుతాయని తెలిపారు. వేతన వ్యత్యాసాలను సవరించవచ్చని చెప్పారు. పీస్ రేట్ వర్కర్లకు కనీస వేతనం చెల్లించవచ్చని పేర్కొన్నారు. సంస్థకు ప్రయోజనమే అన్నారు. వాటికన్న అడ్డంకు లేంటో ప్రభుత్వం, యాజమాన్యం చెప్పాలన్నారు. యూనియన్ డిస్కం అధ్యక్షుల ఎస్.శివశంకర్ మాట్లాడుతూ సంస్థలో విలీనం వల్ల కార్మికులకు,సంస్థకు లాభం అంటుంటే నష్టం వచ్చే పనుల వైపు యాజమాన్యం, ప్రభుత్వాలు ఎందుకు మొగ్గు చూపుతున్నాయని ప్రశ్నించారు. గ్రేడ్-2 జెఎల్ఎంకు ఎపిఎస్ఇబి సర్వీస్ రెగ్యులేషన్స్ వర్తింపచేయడానికి వచ్చే ఇబ్బందులు ఏమిటి చెప్పాలన్నారు.1999, ఫిబ్రవరి ఒకటి తర్వాత చేరిన కార్మిక, ఉద్యోగులకు పాత పెన్షన్ కోసం కోర్టుకు వెళ్లాలని పేర్కొన్నారు. అదిగో వచ్చే ఇదిగో వచ్చే! అంటూ 20 సంవత్సరాలు తరువాత మీకు రాదు అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ చట్టాలు చిన్న ఉద్యోగులకు మాత్రమేనా అని ప్రశ్నించారు. నిన్న, మొన్న ఎంపికైన కోట్లకు పడగలెత్తిన ఎమ్మెల్యేలు, ఎంపీలకు కూడా రెండు మూడు పెన్షన్లు ఎలా ఇస్తున్నారు ? చట్టాలు తమ కోసం చేస్తున్నారా?అని పేర్కొన్నారు. అన్ని పార్టీల ప్రభుత్వ పెద్దలకు అనుకూలంగా చట్టాలు మారుతున్నప్పుడు, కార్మిక వర్గం కోసం చట్టాలు మార్చండని డిమాండ్ చేశారు. పెన్షన్ భిక్ష కాదు అది కార్మిక, ఉద్యోగుల హక్కు అన్నారు. సంస్కరణల పేరుతో యాజమాన్యం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇష్టం వచ్చినట్టుగా వ్యవహరిస్తున్నాయని వాపోయారు. గత ప్రభుత్వ విధానాన్ని, ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తుందని కార్మిక, ఉద్యోగులందరూ గ్రహించాలని సూచించారు. ఈనెల 9న కార్మిక, ఉద్యోగుల పొట్టగొట్టే, విద్యుత్ సంస్థను ప్రయివేటు వారికి కట్టబెట్టే విద్యుత్ అమెండ్‌మెంట్ బిల్లును వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బిఎల్ రసూల్ మాట్లాడుతూ సంస్థను ప్రయివేటీకరణ వైపు తీసుకెళ్లడానికి సృష్టించిన, కాంట్రాక్ట్ వర్కర్, జెఎల్ఎం గ్రేడ్-2, పీస్ రేట్ వర్కర్ల ప్రయోజనాల కోసం అందరికీ పాత పెన్షన్ వర్తింపజేయాలని కోరారు. స్ట్రగుల్ కమిటీ నాయకులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సురేంద్ర, శివకుమార్, నాగ మల్లయ్య, రియాజ్, బండి రామ్మోహన్, పిసి కొండయ్య, నరసింహులు గోపి రవికుమార్ చెన్నకృష్ణ, బాష పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల ప్రధాన సమస్యలను వెంటనే పరిష్కరించాలని విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ జనరల్ సెక్రెటరీ వెన్నపూస సుబ్బిరెడ్డి తెలిపారు. ఆర్‌టిపిపి మెయిన్ గేటు వద్ద శుక్రవారం నిరసన తెలిపిన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యుత్ కార్మికులను విలీనం, పనికి తగ్గ వేతనం, ఉద్యోగుల పెండింగ్ డిఎలు, అన్ లిమిటెడ్ మెడికల్ పాలసీ విషయంలో యాజమాన్యం మొండి వైఖరి విడనాడాలని పేర్కొన్నారు. స్ట్రగుల్ కమిటీతో పాటు సంబంధిత యూనియన్లతో ఈ విషయం పట్ల చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో విద్యుత్ కార్మికులను సంస్థ విలీనం చేసి పే స్కేల్ ఇస్తున్నారని తెలిపారు. ఇక్కడ కూడా అవుట్‌సోర్సింగ్ కార్మికులను వెంటనే రెగ్యులర్ చేయాలన్నారు. అధికారంలోకి రాకముందు కార్మికులకు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక మోసగించడం కూటమి ప్రభుత్వానికి తగదని విమర్శించారు. స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర వ్యాపిత నిరసన పిలుపులో భాగంగా ఆర్‌టిపిపి మెయిన్ గేటు వద్ద ఉద్యోగులు, కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి, నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో స్ట్రగుల్ కమిటీ నాయకులు వెంకటస్వామి, హరి ఓబుళరెడ్డి, గంగయ్య, చంద్ర శేఖర్, పుల్లారెడ్డి, మోహన్, అబ్దుల్ హమీద్, వెంకట రమణ, రాజు ప్రసాద్ పాల్గొన్నారు.

కడప ఎస్ఇ భవనం నిరసన తెలియజేస్తున్న జెఎసి నాయకులు

ఆర్‌ఇపిపి ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు, కార్మిక ఉద్యోగులు

మండల అభివృద్ధికి పాటుపడాలి
ప్రజాశక్తి - వల్లూరు

మండల అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని కమలాపురం ఎమ్మెల్యే పుత్త కృష్ణ చైతన్య రెడ్డి ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని అభివృద్ధి కార్యాలయంలో మండల ఉపాధ్యక్షులు గంగయ్య ఆధ్వర్యంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల అధికారులు పూర్తి అవగాహనతో సమావేశానికి హాజరు కావాలన్నారు. అధికారులు మండల వ్యాప్తంగా ప్రజలు సమస్యలు పరిష్కరించే విధంగా పనిచేయాలన్నారు. వ్యవసాయాధికారి రైతులకు పండించే పంటలకు పూర్తి అవగాహన కల్పించే విధంగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మళ్లీ నిర్వహించే సాధారణ సర్వసభ సమావేశానికి అధికారులందరూ కచ్చితంగా పూర్తి అవగాహనతో హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో మండల తహశీల్దార్ శ్రీవాణి, ఎంపిడిఒ రఘురాం, డిప్యూటీ ఎంపిడిఒ శీధర్ , మండల సొసైటీ బ్యాంకు చైర్మన్ లేబాక నాగేశ్వర్ రెడ్డి, మండల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

హక్కులు, చట్టాలపై అవగాహన అవసరం
ప్రజాశక్తి - కడప : బాలల హక్కులు, చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారి పి. రమాదేవి అన్నారు. అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా శుక్రవారం డాక్టర్ వైఎస్ఆర్ స్పోర్ట్స్ స్కూల్‌లో బాల బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల సమస్యలు, బాలల ఆరోగ్యం, విద్య, వైద్యం, బాలల సంక్షేమ, ఆహారం, బాలలకు సమస్యలు వస్తే ఎవరికీ తెలియజేయాలి, ఎవరిని సంప్రదించాలి తదితర విషయాలపై బాలబాలికలకు అవగాహన కల్పించారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి బి.ఆర్ సుభాష్ యాదవ్ మాట్లాడుతూ బాలల సమస్యలను తెలియజేసి, వాటిని ఎలా పరిష్కరించాలో వివరించారు. పిల్లలకి ఏదైనా సమస్యలు ఉన్నట్లయితే ఫిర్యాదుల బాక్స్‌లో నిర్భయంగా రాసి వేయాలని తెలియజేశారు. సెంటర్ అడ్మినిస్ట్రేటర్ ఎన్. అశ్విని మాట్లాడుతూ ఏ వయస్సు వారిని బాలలు అంటారని తెలియజేశారు. బాల్యవివాహాలు, బాలిక విద్య ప్రాముఖ్యతను తెలియజేశారు. టోల్ ఫ్రీ నంబర్స్ 1098, 112, 100, 108, 181 తదితర నెంబర్లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పిఆర్ సునీత రాజు, స్కూల్ హెచ్‌ఎం ఆంజనేయులు, రాఘవ రెడ్డి, జిల్లా బాలల పరిరక్షణ విభాగపు సిబ్బంది కృష్ణ ప్రతిరూప్, .కె.యూనుస్ బాష, ఒఎస్‌సి సిబ్బంది మానస, సునీత, ఉమా, క్రీడా పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కష్టపడే వారికే పదవులు
ప్రజాశక్తి - కడప అర్బన్

తెలుగుదేశం పార్టీలో కష్టపడి పనిచేసే వారికి పదవులు దక్కుతాయని, వెనుక నిలబడిన వారు అలా వెనకనే ఉంటారని నగర అధ్యక్షులు పఠాన్ మన్సూర్‌అలీఖాన్ స్పష్టం చేశారు. శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎపి అభివృద్ధికి ప్రధానమంత్రి మోడీ సహకరిస్తున్నారని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ కష్టపడుతున్నారని తెలిపారు. విమర్శించేముందు వారు ఆత్మ విమర్శ చేసుకోవాలని హితవు పలికారు. ఉదయం టిడిపి, రాత్రి వైసిపితో జతకడితే కోవర్టులవుతారని చెప్పారు. ఎలాంటి ఎన్నికలు వచ్చినా కూటమి విజయం సాధించడం తథ్యమని పేర్కొన్నారు. కార్పొరేటర్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ నిజమైన టిడిపి కార్యకర్తలు పార్టీ పదవులకు ఎప్పుడు ఆశపడని తెలిపారు. కష్టపడే వారిని అధిష్టానం గుర్తించి పిలిచి పదవులు ఇస్తుందని చెప్పారు.

సమావేశంలో మాట్లాడుతున్న మన్సూర్ అలీఖాన్

రేపు 'మహాదాత బుడ్డా వెంగళరెడ్డి' పుస్తక పరిచయ సభ
ప్రజాశక్తి - కడప అర్బన్

కలియుగ దానకర్ణుడు, మహాదాత బుడ్డా వెంగళరెడ్డి జీవిత చరిత్ర పుస్తక పరిచయ సభ ఈనెల 19న ఉదయం 10.00 గంటలకు కడప నగరం హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీ కోదండ రామాలయంలో నిర్వహించనున్నారు. రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ సభ ఏర్పాటు చేయనున్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఎస్.హరీంద్రనాథ్ అధ్యక్షత జరగనున్న కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, ఆత్మీయ అతిథిగా శాసనమండలి సభ్యులు ఎం.రామచంద్రారెడ్డి పాల్గొనున్నారు. విశిష్ట అతిథులుగా బుడ్డా వెంగళరెడ్డి ఐదవతరం వారసులు బుడ్డా విష్ణువర్ధన్‌రెడ్డి, పుస్తక రచయిత కుమ్మరి దస్తగిరి హాజరు కానున్నారు. వీరితోపాటు గౌరవ అతిథులుగా శ్రీ కోదండ రామాలయ ధర్మకర్త దేసు వెంకటరెడ్డి, ఏపీ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ జిల్లా అధ్యక్షులు మోపూరి బాలకృష్ణారెడ్డి, రెడ్డి సేవా సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి, ఇంటాక్ జాతీయ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు లయన్ కె.చిన్నపరెడ్డి, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి ఎన్.రవిశంకర్‌రెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, నగర ప్రముఖులు పోతుల వెంకట్రామిరెడ్డి పాల్గొనున్నారు. వల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు జీవీ సాయిప్రసాద్ పుస్తక సమీక్ష నిర్వహించనున్నారు.

శ్రీకృష్ణదేవరాయలు పాలన స్ఫూర్తిదాయకం
ప్రజాశక్తి-కడప

శ్రీకృష్ణదేవరాయలు పాలన స్ఫూర్తిదాయకం, ఆదర్శనీయమని ఆయన అడుగుజాడల్లో పాలకులు నడవాలని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా, అన్నమయ్య జిల్లా వైసిపి పరిశీలకులు సురేష్ బాబు, ఇన్‌ఛార్జి మేయర్ ముంతాజ్ బేగం అన్నారు. శుక్రవారం శ్రీకృష్ణదేవరాయలు వర్ధంతిని పురస్కరించుకొని కడప నగరంలోని కృష్ణా సర్కిల్ వద్ద గల ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కడప నగరంలో వైసిపి హయాంలో కృష్ణ సర్కిల్‌ను అభివృద్ధి సుందరీకరణ చేశామని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ విద్యానందరెడ్డి, సీనియర్ నాయకులు తుమ్మలకుంట శివశంకర్, జిల్లా ఉపాధ్యక్షులు దాసరి శివప్రసాద్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాకా సురేష్, మాజీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, కార్పొరేటర్లు మహిళా నాయకులు పాల్గొన్నారు.

కడప రిమ్స్‌లో 'కెఎస్ఆర్ఎం' అన్నదానం
ప్రజాశక్తి - కడప అర్బన్

మాజీ ఎమ్మెల్యే కందుల శివానందరెడ్డి జ్ఞాపకార్థం కడప రిమ్స్ వద్ద ప్రతి మంగళవారం, శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని కందుల విద్యాసంస్థల అధినేత డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2020 నవంబర్‌లో తండ్రి మరణించారని, వారి జ్ఞాపకార్థం 2024 నవంబర్ నుంచి అన్నదాన సేవ కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతీ వారం సుమారు 1000 భోజన పొట్లాలు, మనిషికి 2 వాటర్ ప్యాకెట్లు పంచుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా తమ విద్యా సంస్థలో వివిధ బ్రాంచ్‌లో చదువుతున్న విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్రతీ వారం భోజన ప్యాకింగ్, వితరణ సమయానికి రిమ్స్ లో సహకరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కెఎస్ఆర్ఎం కళాశాల కరస్పాండెంట్, ట్రెజరర్ కందుల రాజేశ్వరీ, చైర్మన్ కందుల మదన్ మోహన్ రెడ్డి, కందుల విద్యా సంస్థల అధినేత డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి భోజన పొట్లాలు పంచారు.

అన్నదానం చేస్తున్న కెఎస్ఆర్ఎం ఎమ్‌డి చంద్ర ఓబుల్‌రెడ్డి, కందుల రాజేశ్వరి

క్లినిక్‌ను సీజ్ చేస్తున్న అధికారులు.

మహిళ మృతికి కారణమైన క్లినిక్ సీజ్

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

పట్టణంలో గురువారం రాత్రి ఆర్ఎంపి క్లినిక్‌లో వైద్యం పొంది మహిళ మృతి చెందిన సమాచారం అందుకున్న జిల్లా వైద్యాధికారులు తనిఖీ చేసి సీజ్ చేశారు. మైదుకూరులోని కడప రోడ్డులో ఉన్న ఎంవిఆర్ మెడికల్స్ అండ్ ఫ్యాన్సీ స్టోర్, క్లినికల్ ల్యాబ్‌ను డిఇఎంఒ భారతి, డిప్యూటీ డిఎంహెచ్ఒ మల్లేష్ ఆధ్వర్యంలో సీజ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్లినిక్ లో తనిఖీ నిర్వహించగా పలు నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు గుర్తించామన్నారు. ఎంవిఆర్ క్లినికల్ ల్యాబ్ ఆరోగ్య శాఖ నుంచి ఎటువంటి గుర్తింపు తీసుకోలేదన్నారు. గుర్తింపు లేని ఆ ల్యాబ్‌లో రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్ కేంద్రాన్ని కూడా నిర్వహిస్తున్నారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నందున, అధికారులు క్లినికల్ ల్యాబ్‌తో పాటు కేంద్రానికి సంబంధించిన సామగ్రిని సీజ్ చేశామన్నారు. అనంతరం పట్టణంలోని కొన్ని ఆర్ఎంపి క్లినిక్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజా మెడికల్ షాప్ వద్దకు వైద్యం కోసం చిన్నపిల్లలు తీసుకురావడానికి గమనించి మందలించారు. అర్హత కలిగిన వైద్య సిబ్బంది వద్ద మాత్రమే చికిత్స పొందాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మెడికల్ ఆఫీసర్ ఎస్. అయేషా, డిస్ట్రిక్ట్ లీగల్ కాన్సలెంట్ ఎం. పాలేశ్వర్ రావు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్లు, ఎం. మరియా కుమారి, ఆర్. వెంగల్ రెడ్డి, టి.జయ ప్రకాష్, సూపర్‌వైజర్లు, కె. వీరాంజనేయులు, డి. వెంకటేశ్వర్లు, ఎఎన్ఎం, యశోద పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ వీర కిషోర్

ఆదాయ వనరులను గుర్తించాలి

ప్రజాశక్తి - చాపాడు

గ్రామ పంచాయతీల అభివృద్ధిలో భాగంగా అందుబాటులో ఉన్న వనరులను గుర్తించాలని ఎంపిడిఒ వీరకిషోర్ తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో గ్రామ పంచాయతీ సర్పంచ్‌లకు డిజిటల్ , ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు ఆదాయ వనరుల గుర్తింపు పై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం స్వతహాగా ఆదాయ వనరులను గుర్తించుకోవాలన్నారు. ప్రస్తుతం ఇంటి పన్ను మాత్రమే ఆదాయంగా ఉందన్నారు. చెత్త నుండి సంపద సృష్టించుకోవాలన్నారు. వాటితోపాటు నూతన ఆలోచన విధానాల ద్వారా పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం ట్రైనర్ సుబ్బరాయుడు సభ్యులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ హరినాథ్, ఆర్డబ్ల్యూఎస్ ఎఇ మహమ్మద్, పిఆర్ ఎఇ చంద్రమౌళి, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛపై పోలీసుల దాడులు నిలిపివేయాలి

ప్రజాశక్తి- మైదుకూరు రూరల్ : పత్రికా స్వేచ్ఛపై పోలీసులు చేస్తున్న దాడులను తక్షణమే నిలిపివేయాలని మైదుకూరులోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు కోరారు. ఈ మేరకు శుక్రవారం వారు మైదుకూరు అర్బన్ సిఐ కె. రమణారెడ్డికికి వినతి పత్రాన్ని అందజేశారు. సాక్షి దినపత్రిక హైదరాబాద్ కార్యాలయంపై సోదాల పేరుతో దాడులు చేయడం, ఆ పత్రిక ఎడిటర్ ధనుంజయ రెడ్డికి, నెల్లూరు బ్యూరోకు నోటీసులు జారీ చేయడాన్ని ఈ సందర్భంగా విలేకరులు తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో పత్రికలు, న్యూస్ ఛానళ్లు ప్రజా సమస్యలపై ఎంతో బాధ్యతతో పనిచేస్తున్నాయని మీడియా ప్రతినిధులు పేర్కొన్నారు. అయినప్పటికీ, ప్రభుత్వాలు తమ తప్పులను ప్రజలకు తెలిసేలా బహిర్గతం చేస్తున్నాయనే అక్కసుతో పత్రికలపై తప్పుడు కేసులు బనాయించడం, సోదాల పేరుతో దాడులు చేయడం, నోటీసులతో బెదిరించడం చాలా శోచనీయమని అన్నారు. ఇలాంటి చర్యలు పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలిగించేవేనని, కాబట్టి ఇప్పటికైనా పత్రికా స్వేచ్ఛపై జరుగుతున్న దాడులను తక్షణమే ఆపాలని వారు గట్టిగా డిమాండ్ చేశారు.

పథకాల అమలుతోనే అభివృద్ధి

ప్రజాశక్తి - కడప అర్బన్

మాట్లాడుతున్న మన్సూర్ అక్బర్

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ నాయకత్వంలో ప్రజల జీవన ప్రమాణాలు పెరిగేలా, పథకాల అమలుతో అభివృద్ధి, సంక్షేమమం పరుగులు పెడుతున్నాయని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మన్సూర్ అక్బర్ అన్నారు. శుక్రవారం పాత బస్టాండ్ లోని మన్సూరు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. సూపర్ జిఎస్‌టి, సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో రూ.13429 కోట్లతో ప్రారంభోత్సవాలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో పిఎం మోదీ చేశారని పేర్కొన్నారు. ఫలితంగా రాయలసీమలో మరింత అభివృద్ధి జరుగుతుందని ప్రజలకు వివరించారు. లోకేష్ బాబుకు రాష్ట్ర పైన పట్టు వచ్చిందని దానిములంగా గూగుల్‌తో పాటు రూ.10 లక్షల పెట్టుబడులు వచ్చాయని స్పష్టం చేశారు.

పని అనుభవంపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు మండలం శివపురంలో గ్రామీణ అవగాహన పని అనుభవ కార్యక్రమంలో భాగంగా ఉటుకూరు డాట్ సెంటర్ సమన్వయకర్త డాక్టర్ కృష్ణప్రియ ఆధ్వర్యంలో తిరుపతిలోని ఎస్.వి.వ్యవసాయ కళాశాల విద్యార్థులు పార్టీ-సెపరేటెడ్ రూరల్ అప్రైజర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రైతులకు అవగాహన కల్పిస్తూ ఒకరి నుండి ఒకరు నేర్చుకోవడంలో సహాయపడుతుందని తెలిపారు. స్వీయ-ఆధారిత కార్యక్రమాలను ప్రేరేపిస్తుం దన్నారు. కార్యక్రమంలో భాగంగా, శివపురం గ్రామానికి సంబం ధించిన సామాజిక మ్యాప్, వెన్ రేఖాచిత్రం ప్రదర్శిం చబడ్డాయి. అదేవిధంగా, ట్రాన్సెక్ట్ వాక్ నిర్వహించారు. గ్రామంలోని రైతు సోదరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే సదస్సులు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

విద్యార్థుల్లో నెలకొన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే సదస్సులు ఎంతో ఉపయోగపడతాయని కన్వీనర్ మురళి అన్నారు. పులివెందుల జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సర్వజ్ఞ 2కె25 కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు ప్రాజెక్ట్ ఎక్స్పో, కోడింగ్ ఛాలెంజెస్ టెక్ మేంతో పాటు జెనరేటివ్ ఎఐ, ఫుల్ స్టాక్ వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమాల్లో రాష్ట్రంలోని వివిధ ఇంజినీరింగ్ కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం ముఖ్య ఉద్దేశం నూతన ఒరవడితో కూడిన విజ్ఞానాన్ని విద్యార్థులు అందిపుచ్చుకొని భవిష్యత్తులో ఉన్నతమైన ఉద్యోగాలు పొందేలా వారిని తీర్చిదిద్దడమేనని కన్వీనర్ డాక్టర్ జి.మురళి మహీంద్ర రెడ్డి, బి. ముని లావణ్య పేర్కొన్నారు.

సిసి రోడ్డు పనులు ప్రారంభించాలంటూ

సిపిఎం వినూత్న నిరసన

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

వరి నాట్లు వేసి నిరసన తెలియజేస్తున్న సిపిఎం నాయకులు, గ్రామస్తులు

బ్రహ్మసాగర్ మునక ప్రాంత వాసులు నివాసాలు ఏర్పరచుకొని జీవిస్తున్న కొత్త బస్వాపురం గ్రామానికి సిసి రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.శివకుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం గ్రామస్తులు బురద రోడ్డుపై వరినాట్లు నాటుతూ వినూత్నంగా నిరసన ఎలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు 35 సంవత్సరాల కిందట బ్రహ్మ సాగర్‌లో మునకు గురైన మొట్టమొదటి ప్రాంతం బస్వాపురం గ్రామమని మునక వాసులు కొత్త బస్వాపురం గ్రామం పేరుతో నివాసం ఉంటున్నారని చెప్పారు. నివాసాలకు ప్రధాన రోడ్డుకు మధ్యలో దాదాపు కిలోమీటర్ మేరా మట్టి రోడ్డు ఉందని, ఇక్కడ సిసి రోడ్డు ఏర్పాటు కోసం గ్రామ ప్రజలు వందలసార్లు అధికారులకు. ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నారని చెప్పారు. గ్రామ సమస్య పరిష్కారం కాలేదని వారు ఆందోళన వెల్లబుచ్చారు. అనునిత్యం విద్యార్థులు, రైతులు, ప్రజలు ఏ చిన్న అవసరం వచ్చిన టౌన్‌కు రావాలంటే ఈ రోడ్డే ప్రధాన మార్గమని చెప్పారు. రోజూ అనేక మంది బురదలో జారీ కింద పడి ఆసుపత్రి పాలవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రెండేళ్ల కిందట ఈ ప్రాంత వార్డుసభ్యులు, గ్రామస్తులు ఆందోళన చేసిన సందర్భంలో ప్రస్తుత ఎమ్మెల్యే తాము అధికారంలోకి వచ్చిన వెంటనే సిసి రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. రోడ్డు మంజూరైనా కమీషన్ల పంపకాల్లో వచ్చిన బేధాబీ ప్రాయాల కారణంగా సిసి రోడ్డును వేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని చెప్పారు. గ్రామంలో ఇంకా విద్యుత్‌లైన్ల మార్పులు, పాత పోల్స్ మార్చడం వంటి సమస్యలున్నాయని లేనిపక్షంలో గ్రామస్తులతో కలిసి ఆందోళన కార్యక్రమాలను తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గండి సునీల్ కుమార్, మండల కమిటీ సభ్యులు సానా గోవిందు, హరి, రెబ్బా నరసింహులు, అజయ్ కుమార్, నాయకులు అరవింద్, ప్రదీప్ గురయ్య, స్థానిక గ్రామస్తులు పాల్గొన్నారు.

పులివెందుల మున్సిపల్ ఎన్నికల్లో

టిడిపి జెండా ఎగరవేస్తాం

- పులివెందుల టిడిపి ఇన్‌ఛార్జి బిటెక్ రవి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బిటెక్ రవి

ప్రజాశక్తి -పులివెందుల రూరల్

రాబోవు పులివెందుల మున్సిపల్ ఎన్నికల్లో టిడిపి జెండా ఎగరవేస్తామని, మున్సిపల్ చైర్మన్‌తో పాటు కౌన్సిల్‌ను గెలిపించుకొని కార్యకర్తలకు న్యాయం చేస్తామని పులివెందుల టిడిపి నియోజవకర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే బిటెక్ రవి అన్నారు. శుక్రవారం ఆయన టిడిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వై సి పి నాయకులు సతీష్ కుమార్ రెడ్డి వెంట ఉండే కార్యకర్తలకు ఎప్పుడూ నిద్రలేని రాత్రులే గడుపుతున్నారని ఆయన పేర్కొన్నారు. తెలుగు దేశం పార్టీ లో ఉన్నపుడు సతీష్ రెడ్డి వెంటనడిచిన కార్యకర్తలకు ఆయనకు నిద్రలేని రాత్రులే గడిపారని , ఇప్పుడు వైసిపిలోకి వెళ్ళిన తర్వాత ఆయన వెంట నడుస్తున్న కార్యకర్తలతో పాటు వైసిపి నాయకులకూ నిద్రలేని రాత్రులు మొదలయ్యాయని అన్నారు. వైసిపి మున్సిపల్ ఇన్‌ఛార్జితోపాటు మున్సిపల్ ఎన్నికల్లో వైసిపి తరుపున చైర్మన్‌గా దుశ్యంత్ రెడ్డిని నియమించారని, వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి వచ్చి పులివెందులలో కూర్చున్నా మున్సిపల్ ఎలక్షన్లలో టిడిపి జెండా ఎగరడం ఖాయమని అందుకు తగిన స్ట్రాటజీని ఫాలో అవుతామని ఆయన అన్నారు. నమ్మిన కార్యకర్తలకు న్యాయం చేయడమే తమ ముందున్న లక్ష్మమని తెలిపారు. నీటి సంఘాలు, జడ్‌పిటిసి ఎన్నికలలో ఎలాంటి స్ట్రాటజీని ఉపయోగించామో వచ్చే మున్సి పల్ ఎన్నికలలో కూడా అలాంటి విధానాన్ని ఉపయోగించి తప్ప కుండా టిడిపి జెండాను పులివెందులలో ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. పులివెందుల నియోజకవర్గంలో రైతులకు సంబంధించి పలు సమస్యలపై ఫోన్‌ద్వారా బిటెక్ రవి వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుతో మాట్లాడారు. నియోజవర్గంలో బుడ్డ శనగ విత్తన పంపిణీకి సంబంధించి తెలియజేశారు. నాలుగైదు రోజుల్లో సమస్యను పరిష్కరి స్తామని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, పట్టణమాజీ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షులు, ఎపి ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అన్నా రెడ్డి ప్రసాద్ రెడ్డి, హక్కుల గారి విజయకుమార్‌రెడ్డి ఉన్నారు.

రోడ్డుకు మోక్షం కలగడం హర్షణీయం

ప్రజాశక్తి - వేంపల్లె

రోడ్డు పనులను పరిశీలిస్తున్న తులసిరెడ్డి

వేంపల్లె రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం కలగడం హర్షణీయమని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వేంపల్లెలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను తులసి రెడ్డి కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. కాంట్రాక్టర్‌తో చర్చించి రోడ్డు పనులు మధ్యలో ఆపవద్దని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందుల-వేంపల్లె-కడప రోడ్డులో వేంపల్లె పట్టణ పరిధిలో 3. 8 కిలోమీటర్ల పొడువుతో నాలుగు లైన్ల సిసి రోడ్డు 2023 జూన్ 28న మంజూరు అయినట్లు చెప్పారు. 2025 మార్చి 15 నాటికి పనులు పూర్తి కావాల్సి ఉందని కాని దురదృష్టవశాత్తు 27 శాతం పనులు పూర్తి అయిన తర్వాత మిగిలిన పనులు అర్ధాంతరంగా నిలిచిపోయినట్లు చెప్పారు. నిధుల కొరత కారణంగా పనులు ఆగిపోయాయని చెప్పారు. విస్తరణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయిన కారణంగా అప్పటికే ఉన్న రోడ్డును తవ్వడం జరిగిందని తెలిపారు. కొత్త రోడ్డు వేయలేదని తెలిపారు. దీనివల్ల అటు వాహనదారులు, బాటసారులు, ప్రజలు రెండున్నర సంవత్సరాలుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రోడ్డు పనులు జరగక పోవడంతో ప్రజలు భూలోకంలో యమలోకం చూస్తున్నారని తులసి రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ తరపున అనేకసార్లు ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి, అధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. రెండు రోజులుగా పనులు మళ్లి ప్రారంభం కావడం సంతోషకరమని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి, ఐచర్ రమణ, చిన్నకోట్ల నాగరాజు పాల్గొన్నారు.

ఘనంగా భూపేష్‌రెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-జమ్మలమడుగు

కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న కూటమి నాయకులు

జమ్మలమడుగులో శుక్రవారం తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బ రామిరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కస్తూరిబా పాఠశాలలో గూడెంచెరువు కూటమి నాయ కులు బాలు యాదవ్, ఖాదర్ మార్కెట్ యార్డు చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి చేత విద్యార్థులకు స్వీట్లు పంచి, పాఠశాల ఆవరణంలో పూల మొక్కలను నాటించారు. సాయంత్రం టి వనంలో నందు జింకల బాష, సుధీర్ కుమా ర్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి కలిసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాల యంలో జితేంద్ర, గణేష్, రవి, చౌడేశ్వర్, జయ చంద్ర, పొన్నతోట బ్రదర్స్, చిన్నముడియం పురుషోత్తమ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు. **ముద్దనూరు :** టిడిపి జమ్మలమడుగు నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూపేష్ రెడ్డి జన్మదినం సందర్భంగా శుక్రవారం మండల అధ్యక్షులు చింతా శివరామి రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక టిడిపి కార్యాలయంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.నాయకులు, శ్రేణులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు .అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు రంగారెడ్డి, ప్రసాద్ రెడ్డి,శేఖర్ నాయుడు, జగదీశ్వర్ రెడ్డి, మాబు, సత్తార్, లక్ష్మి నారాయణ పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నంద్యాల వరద రాజులరెడ్డి

సిఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

నియోజకవర్గానికి చెందిన 22 మంది లబ్ధిదారులకు రూ. 45,05,745 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి స్థానిక నెహ్రూ రోడ్డులోని ఆయన కార్యాలయంలోలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద మధ్యతరగతి ప్రజల వైద్య ఖర్చుల నిమిత్తం సకాలంలో సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందిస్తూ తానున్నానని భరోసా కల్పిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ప్రజలందరూ అండగా ఉండాలని తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, జిల్లా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు బద్వేలు శ్రీనివాసుల రెడ్డి, టిడిపి పట్టణ మాజీ అధ్యక్షులు ఘంటసాల వెంకటేశ్వర్లు, మైనారిటీ నాయకులు బేపారి గౌస్ బాషా, కౌన్సిలర్ కమాల్ బాషా, మాజీ కౌన్సిలర్ తలారి పుల్లయ్య, వద్ది ఓబులేసు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ దివిజా సంపతి

గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- ఖాజీపేట

గ్రామ పంచాయతీలు అభివృద్ధి బాటలో పయనించాలంటే ప్రభుత్వం ద్వారా వచ్చే నిధులతోపాటు, స్థానిక సొంత ఆదాయ వనరుల అవకాశాలను ఏర్పాటు చేసుకోవాలని మండల అభివృద్ధి అధికారి దివిజాసంపతి అన్నారు. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయ సభ భవనంలో గ్రామ సర్పంచులు, కార్యదర్శులు, డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లుకు ఆదాయ వనరులు పెంపొం దించుకోవడం ఎలా అన్న అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒమాట్లాడుతూ పంచాయతీలు స్థానిక ఆదాయ వనరుల గురించి అన్వేషించాలని, తద్వారా పంచాయతీలు మరింత అభివృద్ధి సాధిస్తాయన్నారు. గ్రామ పంచాయితీలలో ఆదాయంపై దృష్టి పెట్టేందుకు సిబ్బంది అందరూ కృషి చేయాలన్నారు. **చేతుల శుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం ...** విద్యార్థులు చేతులు శుభ్రతను తప్పక పాటించాలని మండల అభివృద్ధి అధికారి దివిజా సంపతి అన్నారు. శుక్రవారం జడ్‌పిఉన్నత పాఠశాలలో చేతుల పరిశు భ్రత దినోత్సవం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు చేతుల శుభ్రత గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ భోజనానికి ముందు, మలవిసర్జన తర్వాత చేతులను తప్పక శుభ్రం చేసుకోవాలని సూచించారు. చేతుల శుభ్రత ద్వారా ఎటువంటి అనారోగ్య సమస్యలు ఎదురవ్వవన్నారు. ఈ సందర్భంగా పరిశుభ్రత అంశాల మీద వివిధ పోటీలు నిర్వహించి ప్రతిభావంతులైన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మండల ఎంఇఒలు నాగ స్వర్ణలత, సత్యనారాయణ, సార్డ్స్ ఎన్‌జిఒ రీజనల్ ప్రోగ్రాం ఆఫీసర్ విష్ణువర్ధన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఆర్‌పిఎస్, అనుబంధాల సంఘాల నాయకులు

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-మైదుకూరు రూరల్

సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బి.ఆర్. గవాయిపై దాడి చేసిన న్యాయవాదిని కఠినంగా శిక్షించాలని ఎంఆర్‌పిఎస్, అనుబంధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఎంఆర్‌పిఎస్ నాయకులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు శుక్రవారం పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ చంద్రలీలకు ఎంఆర్‌పిఎస్ నాయకులు వినతి పత్రం అందజేశారు. దళిత సమాజంపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, అన్యాయలకు గురవుతున్న దళితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మానికింది వెంకటేష్ మాదిగ, బుడగ జంగం నాయకులు కొండయ్య, బాలసుబ్బయ్య, కొండయ్య మాదిగ, టైలర్ ఓబన్న మాదిగ, పెర్న పాటి ఓబన్న మాదిగ, మంజుల మాదిగ, విజయ్ రాణి మాదిగ, కార్తీక్ మాదిగ, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

IN THE COURT OF HON'BLE IInd ADDITIONAL DISTRICT JUDGE, PRODDATUR

I.A.No. 1253/2024

O.S.No.30/2024

Perla Gopinath Reddy. ...Petitioner/Plaintiff

Vs

R12. Smt K.Swapna, W/o K.Mahesh Reddy, R/o.D.No.4/810-C, Mahathma Nagar, CCI Road, Yerraguntla Town & Mandal, YSR District

R15. Smt Gundluru Suneetha W/o G.Anil Kumar Reddy, R/o.D.No. D.No.5/80, PNR Street, Yerraguntla Town & Mandal

R18. Smt M.Lokeswari W/o madhusudhan Reddy D/o Late S.Chenna Reddy, Hindu, Housewife, Aged 68 years, residing behind Thyagarajareddy Hospital, Proddatur Town & Mandal.

...Respondents/Defendant Nos.12, 15 & 18

You are hereby informed that the above said petitioner has filed the above petition against you for temporary injunction and the above petition is posted to 30.12.2025 for your appearance and you are hereby requested to make your appearance either personally or through an advocate before the above said Hon'ble IInd Additonal District Judge Court, Proddatur on 30.12.2025 at 10.30 AM.

K.S.SUDARSAN REDDY

Advocate for Petitioner/Plaintiff

IN THE COURT OF HON'BLE IInd ADDITIONAL DISTRICT JUDGE, PRODDATUR

O.S.No.30/2024

Perla Gopinath Reddy. ...Plaintiff

Vs

D12. Smt K.Swapna, W/o K.Mahesh Reddy, R/o.D.No.4/810-C, Mahathma Nagar, CCI Road, Yerraguntla Town & Mandal, YSR District

D15. Smt Gundluru Suneetha W/o G.Anil Kumar Reddy, R/o.D.No. D.No.5/80, PNR Street, Yerraguntla Town & Mandal

D18. Smt M.Lokeswari W/o madhusudhan Reddy D/o Late S.Chenna Reddy, Hindu, Housewife, Aged 68 years, residing behind Thyagarajareddy Hospital, Proddatur Town & Mandal.

...Defendant Nos.12, 15 & 18

You are hereby informed that the above said plaintiff has filed the above suit against you for partition and separate possession of his share and the above suit is posted to 30.12.2025 for your appearance and you are hereby requested to make your appearance either personally or through an advocate before the above said Hon'ble IInd Additional District Judge Court, Proddatur on 30.12.2025 at 10.30 AM.

K.S.SUDARSAN REDDY

Advocate for Plaintiff

మహారాజశ్రీ ప్రొద్దుటూరు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

O.S.No. 32/2024

మండెద్దు శ్రీనివాసుల రెడ్డి, తండ్రి రామి రెడ్డి, వయస్సు 48 సంఎలు, హిందూ, వ్యవసాయం, సాకిన్ డి.నెం.8/86, కొత్తపేట గ్రామము, పెద్దశెట్టిపల్లె పంచాయితి, ప్రొద్దుటూరు మండలం, వై.యస్.ఆర్ జిల్లా. ...వాది

Vs

1. గంజికుంట సుబ్బా రెడ్డి, తండ్రి సుబ్బా రెడ్డి అలియాస్ వెంకట సుబ్బా రెడ్డి, వయస్సు 40 సంఎలు, హిందూ, వ్యావసాయం, సాకిన్, డి.నెం.4-215, కానపల్లె గ్రామము, ప్రొద్దుటూరు మండలం, వై.యస్.ఆర్.జిల్లా. ...1వ ప్రతివాది

1వ ప్రతివాదికి దావా సమను - నోటీసు

పై నెంబరు దావాలోని వాది 07-04-2021వ తేది విక్రయ అగ్రిమెంటు ప్రకారం 1వ ప్రతివాది అయిన నీవు మరియు 2వ ప్రతివాది వాది పేర దావా షెడ్యూలు దాఖలా ఆస్థికి రిజిష్టరు విక్రయ దస్తావేజును వ్రాయించలేదని, అట్టి 07-04-2021 తేది విక్రయ అగ్రిమెంటు పైన స్పెసిఫిక్ పర్ ఫార్మెన్స్ దావాను రిజిష్టరు విక్రయ దస్తావేజు వ్రాయించమని కోరి దావాతో పాటి I.A.No.674/2024గా పిటిషను షెడ్యూలు దాఖలా ఆస్థిని ఇతరులకు అమ్మకూడదని ఇంజంక్షన్ కోరి పై నెంబరు పిటిషన్ను మీపైన మరియు ఇంకొకరిపైన దాఖలు చేసి ఉన్నాడు. అట్టి దావాలో మరియు పిటిషనులో 1వ ప్రతివాది అయిన మీ హాజరు కొరకు 28.10.2025వ తేదిన వాయిదా ఉంటున్నది. పై దావాలో మరి యు పిటిషనులో మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల 28.10.2025వ తేదిన ఉదయం 10.30 గంటలకు పై కోర్టు యందు హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనం తట మీ పరోక్షమున తీర్మాణించబడును.

వాయిదా తేది: 28.10.2025

// కోర్టు వారి ఉత్తర్వు మేరకు//

పి.రఘునాథ రెడ్డి,

అడ్వకేట్, ప్రొద్దుటూరు.

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P.No : 20/2024

in

O.S.No : 202/2022

బొబ్బడి రఘు .. డి.హెచ్.ఆర్

వర్సస్

యాసం అంకయ్య అలెగ్జాండర్ ..జె.డి.ఆర్

To,

జె.డి.ఆర్ చిరునామా

యాసం అంకయ్య అలెగ్జాండర్ తండ్రి ధర్మేశ్వర్ హిందూ, వయస్సు 35 సం.లు, మెకానిక్, ఏపీఎస్ఆర్టీసీ కడప డిపో, కడప టౌన్ మరియు జిల్లా, ఏపీ.

పై నెంబరు అమలు అర్జీలోని డిక్రీహోల్డర్ డిక్రీ పరిహారం రాగోరుచూ పై నెంబరు అమలు అర్జీని శ్రీ కోర్టునందు దాఖలు చేసి యున్నాడు. సదరు అమలు అర్జీలో మీరు పైకోర్టులో హాజరై మీఆక్షేపణలు తెలుపుటకు వాయిదా 23-10-2025వ తేదీ యున్నది. మీరు వాయిదా రోజు ఉదయం 10-30 నిమిషాలకు మీరు స్వయంగా గాని మీ వకీలు గారి ద్వారా గాని పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది. లేనిచో మీపరోక్ష మందు సదరు అమలు అర్జీని విమర్శించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

గిద్దలూరు

తేదీ : 17-10-2025 ఇట్లు

శ్రీ బి.డి గిరి

శ్రీ తురగా ఈశ్వర అంజనీకుమార్.

అడ్వకేట్స్, గిద్దలూరు.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

Creditor I.P.No. 78 /2018

పల్లా శివ ప్రసాద్ రెడ్డి అలియాస్ ప్రసాద్ రెడ్డి, తండ్రి ప్రభాకర్ రెడ్డి, వయస్సు 48 సం॥లు, హిందూ, సాకిన్, డి.నెం. 3-32-ఎ, చౌడూరు గ్రామము, ప్రొద్దుటూరు మండలం, ప్రస్తుతము డి.నెం. 103, శ్రీ క్రిష్ణ రెసిడెన్సీ, పెద్దమ్మ చెట్టు దగ్గర, వై. యం.ఆర్ కాలనీ, ప్రొద్దుటూరు టౌన్, కడప జిల్లా. **...పిటిషనరు/క్రెడిటార్**

Vs

1. బీరం జనార్ధన్ రెడ్డి, తండ్రి వెంకట రెడ్డి, వయస్సు 38 సం॥లు, హిందూ, సాకిన్, డి.నెం.3/73, కుమ్మరిపల్లె గ్రామము, పగిడాల పోస్టు, రాజుపాళెం మండలం, కడప జిల్లా, ప్రస్తుతము డి.నెం.ఎల్.ఐ.జి.-965, పెంట్ హౌస్, థర్డ్ ఫేజ్, కె.పి.హెచ్.బి కాలని, కూకట్పల్లి, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం.
2. బీరం ధనుష్ కుమార్ రెడ్డి, తండ్రి బీరం జనార్ధన్ రెడ్డి, వయస్సు 12 సం॥లు, హిందూ, మైనర్,
3. బీరం లక్ష్మి నందన్ రెడ్డి, తండ్రి బీరం జనార్ధన్ రెడ్డి, వయస్సు 6 సం॥లు, హిందూ, మైనర్,

రెస్పాండెంట్స్ 2 & 3 మైనర్లు అయినందున గార్డియన్ తల్లి బీరం వసుంధరా దేవి, భర్త జనార్ధన్ రెడ్డి, వయస్సు 30 సం॥లు, హిందూ, గృహిణి,

రెస్పాండెంట్స్ 2 & 3 సాకిన్ ప్లాట్ నెం.302, యస్. యస్ రెసిడెన్సీ, సున్నంబట్టి వీధి, వై.యం.ఆర్ కాలనీ, ప్రొద్దుటూరు టౌన్, కడప జిల్లా.

...1 నుండి 3 రెస్పాండెంట్స్

1 నుండి 3వ రెస్పాండెంట్కు నోటీసు

పై నెంబరు పిటిషనులో పిటిషనరు 1వ రెస్పాండెంట్ను ఇన్సాల్వెంట్గా డిక్లేర్ చేయమని కోరుచూ మరియు పిటిషను లో 4వ రెస్పాండెంట్ 17.07.2018వ తేదిన 2 మరియు 3వ రెస్పాండెంట్స్ పేర్లతో వ్రాయించిన రిజిష్టరు దాన దస్తావేజును రద్దు పరచమని కోరుచూ పై కోర్టు యందు పై నెంబరు క్రెడిటార్ ఐ.పి.ని దాఖలు చేసి ఉన్నాడు.అట్టి ఐ.పి నందు 1 నుండి 3వ రెస్పాండెంట్స్ అయిన మీ హాజరు కొరకు 21.11.2025వ తేదిన వాయిదా ఉంటున్నది. పై ఐ.పిలో మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల 21.11.2025వ తేదిన ఉదయం 10.30 గంటలకు పై కోర్టు యందు హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనంతట మీ పరోక్షమున తీర్మాణించబడును.

వాయిదా తేది: 21.11.2025

// కోర్టు వారి ఉత్తర్వు మేరకు//

పి.రఘునాథ రెడ్డి,

అడ్వకేట్, ప్రొద్దుటూరు.